# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 29, అక్టోబర్ 2025




# ప్రతి పౌరుడూ ఒక పోలీసే..

★ చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి ★ మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్



నస్పూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త

ప్రతి పౌరుడు ఒక పోలీసే అని, సంఘ విద్రోహ శక్తులు, అనుమానిత వ్యక్తుల సమాచారం పోలీసులకు ఇవ్వాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. మంగళవారం పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా సీసీసీ కార్నర్ నుంచి మంచిర్యాల ఐబీ చౌరస్తా వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల డీసీపీ మాట్లాడుతూ, పోలీసులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తారని, విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసుల త్యాగాలు, సేవలు భావితరాలకు స్ఫూర్తిగా మిగతా 2లో..

# గ్రామీణ యువతలో టెక్నాలజీ విప్లవం..



✳ అభివృద్ధి దిశగా అడుగులు ✳ కానీ పక్కనే ప్రమాదాల పల్లకీ...

తిర్యాని, అక్టోబర్28, ప్రభాతవార్త

గ్రామాల దృశ్యం వేగంగా మారుతోంది. ఒకప్పుడు పంట పొలాలు, ధాన్యపు గింజలు, ఆవుల మేకల మధ్య జీవనమార్గం సాగించిన యువత ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లు, డేటా ప్యాకులు, యూట్యూబ్ ఛానళ్లతో కొత్త జీవన అధ్యాయాన్ని రాస్తున్నారు. టెక్నాలజీ గ్రామాల గడప దాటి,పల్లె గుడిసెల్లోకి ప్రవేశించింది. ఆ ప్రవేశం మార్పును తెచ్చింది. అదే సమయంలో కొన్ని కొత్త ప్రమాదాలను కూడా తెచ్చింది. ఇప్పటి గ్రామీణ యువతకు ప్రపంచం చేతిలోనే ఉంది. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు ఇప్పుడు వినోద సాధనాలకంటే ముందుకి వచ్చాయి. ఆన్‌లైన్ కోర్సులు, ఫ్రీలాన్స్ వర్క్, డిజిటల్ మార్కెటింగ్, గ్రాఫిక్ డిజైన్, కంటెంట్ క్రియేషన్ వంటి రంగాలు గ్రామీణ యువతకు కొత్త తలుపులు తెరిచాయి. చాలా మంది యువకులు డిగ్రీలు పూర్తవకముందే స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు. 2 లో..



# నైపుణ్యతను పెంచుకొని ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలి

✪ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

కాగజ్‌నగర్, అక్టోబర్ 28 ప్రభాతవార్త :

నైపుణ్యతను పెంపొందించుకొని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని సుప్రభాతం పాఠశాలలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన ఉచిత నైపుణ్యత శిక్షణ – ఉపాధి కల్పన కేంద్రాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిగతా 2లో..

# విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి

✧ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త

విద్యారంగాన్ని బలోపేతం చేస్తే ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను మిగతా 2లో..





# కోతుల బెడద నుంచి రక్షించాలని ధర్నా

కెరమెరి, అక్టోబర్ 28, ప్రభాతవార్త

కోతుల బెడద నుండి రక్షించండి అంటూ కెరమెరి మండల కేంద్రానికి చెందిన ప్రజాసంఘాల నాయకులు ప్రజలు మంగళవారం బస్టాండ్ ప్రాంతం నుండి అటవీ శాఖ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించి ఎఫ్ఆర్ఓ మజారుద్దీన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అటవీ శాఖ అధికారులు కోతుల బెడద నుండి ప్రజలకు రక్షించాలని ఎన్నిసార్లు విన్నవించిన వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కెరమెరి మండల కేంద్రంలో ఉన్న గుడిసెల పెంకుటి ఇండ్లలో పైనుండి పై నుండి ఇంట్లో వెళ్లి నిత్యవసర సరుకులను ధ్వంసం చేస్తున్నాయి. రెక్కాడితే కానీ డొక్కాడని ప్రజలు కోతుల ఇంట్లో ఉన్న వస్తువులని ధ్వంసం చేయడం మూలంగా పస్తులతో ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఎఫ్ఆర్ఓ జోక్యం మిగతా 2లో..

## ప్రతి పౌరుడూ ఒక పోలీసే..

**(మొదటిపేజీ తరువాయి)**

నిలుస్తాయని పేర్కొన్నారు. చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, సీఐలు ప్రమోద్ రావు, వేణు చందర్, నరేష్ కుమార్, సత్యనారాయణ, బన్సీలాల్, ఎస్సైలు యు. ఉపేందర్ రావు, సంతోష్ కుమార్, తిరుపతి, రాజశేఖర్, సురేష్, తహసీనోద్దీన్, రాజేందర్, పోలీస్ సిబ్బంది, ఎన్‌జీఓ ప్రతినిధులు, భవన కార్మిక సంఘం నాయకులు, స్థానిక యువత, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కోతుల బెడద నుంచి రక్షించాలని ధర్నా

**(మొదటిపేజీ తరువాయి)**

చేసుకొని మండల ప్రజలకు కోతుల బెడద నుండి రక్షణ కల్పించాలని కోరుతున్నాము. ఒక వ్యక్తి కోతికి గాయపరిస్తే ఆ కోతి మా ఫారెస్ట్ పరిధి దాని గాయపరిచినటువంటి వ్యక్తిపై కేసులు పెడతామంటారు. మా పేద ప్రజలపై కోతులు దాడులు చేస్తూ రక్తం రక్తం కారిదాకా దాడి చేస్తే మరి మేము ఎవరిపై కేసులు పెట్టాలో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు సంఘాలు వ్యాపారస్తులు కుటికెల ఆనంద్ రావు, కంబాల వినేష్, కొట్టంగ శ్రీనివాస్, పేందూరు శ్రీనివాస్, రామకృష్ణ, పాలకుర్తి వెంకట స్వామి, గిత్తే తిరుపతి, పూరి రమేష్, సంతోష్, సలీం, మాణిక్ రావు, ముజ్జు, పోషన్న, శేఖర్, జగదీష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

పరిశీలించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందని, ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించిందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకొని ఉన్నత చదువులు అభ్యసించాలని తెలిపారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్య బోధన నాణ్యత పై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి జాతీయ రహదారి విస్తరణలో ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేసి, ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యతను పెంచుకొని ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలి

**(మొదటిపేజీ తరువాయి)**

గ్రామీణ యువతీ యువకులకు నైపుణ్యత శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. ఈ శిక్షణ ద్వారా కంప్యూటర్ పరిజ్ఞానం, ఆంగ్లభాష, వ్యక్తిత్వ అభివృద్ధి వంటి నైపుణ్యాలు నేర్పించనున్నట్లు తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలని, ప్రైవేటు రంగంలో విస్తరిస్తున్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం అభ్యర్థులకు నైపుణ్యతా శిక్షణ కిట్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తరాం, తహసిల్దార్ మధుకర్, ఈజీఎమ్మ్ సంస్థ ప్రతినిధులు, సాహితీ సంస్థ సభ్యులు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

# గ్రామీణ యువతలో టెక్నాలజీ విప్లవం..

**(మొదటిపేజీ తరువాయి)**

యువతలో సోషల్ మీడియా వినియోగం కేవలం చాటింగ్, ఫోటోలు పంచుకోవడం వరకు మాత్రమే పరిమితం కాలేదు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, రీల్స్, షార్ట్ వీడియోలు ఇప్పుడు స్వయం ఉపాధి సాధనాలుగా మారాయి. సంప్రదాయ వంటలు, గ్రామీణ కళలు, జానపద గీతాలు, వ్యవసాయ ప్రక్రియలు, సాంప్రదాయ ఉత్సవాలను వీడియోల రూపంలో ప్రజెంట్ చేస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. కొన్ని గ్రామీణ ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇప్పుడు బ్రాండ్ ప్రమోషన్ల ద్వారా డబ్బులను సంపాదిస్తున్నారు. ఇది గ్రామీణ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా మారింది.



### వ్యవసాయంలో టెక్నాలజీ ప్రభావం...

టెక్నాలజి ప్రభావం రైతు కుటుంబాల జీవన విధానంలోనూ స్పష్టంగా కనిపిస్తోంది. రైతు యువత మొబైల్ యాప్‌ల ద్వారా వాతావరణ సూచనలు, మార్కెట్ ధరలు, పంటల ఆరోగ్య నివేదికలు వంటి సమాచారాన్ని సులభంగా తెలుసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో డ్రోన్ల సహాయంతో పంటలపై మందులు పిచికారీ చేయడం, ఎరువులు వేయడం వంటి పద్ధతులు వేగంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ఇది సాంప్రదాయ వ్యవసాయాన్ని శాస్త్రీయ దిశగా మలచే ప్రయత్నం అని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

### పక్కనే ప్రమాదాల పల్లకీ...డిజిటల్ వ్యసనాల మాయలో యువత...

అయితే ఈ మార్పు వెనుక ఒక నీడ కూడా ఉంది. కొన్ని గ్రామాల్లో యువత గేమింగ్ వ్యసనం, సోషల్ మీడియా మోజు, రాత్రిళ్లు స్క్రీన్ సమయాల పెరుగుదలతో చదువుపై దృష్టి కోల్పోతున్నారు. మానసిక ఒత్తిడి, నిద్రలేమి, ఒంటరితనం వంటి సమస్యలు పెరుగుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా, ఫేక్ న్యూస్‌లు నమ్మడం, తెలియక ఫేక్ లింకులు క్లిక్ చేయడం, ఆన్‌లైన్ మోసాలకు బలికావడం వంటి ప్రమాదాలు కూడా గ్రామాల్లోకి చేరాయి. కొన్ని చోట్ల ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, లాగ్ ఫైనాన్స్ స్కీములు ద్వారా యువత పొదుపు డబ్బులు కోల్పోయిన ఉదంతాలు నమోదయ్యాయి.

### సమతుల్య దృక్పథమే ముందడుగు...

నిపుణుల అభిప్రాయం ప్రకారం, టెక్నాలజీ ఒక సాధనం మాత్రమే దానిని ఎలా వినియోగిస్తామన్నది ముఖ్యం. గ్రామీణ యువతను సాంకేతికంగా విద్యావంతులుగా తీర్చిదిద్దడం, వారికి డిజిటల్ అవగాహన శిక్షణలు అందించడం ఇప్పుడు అత్యవసరం. సర్కార్ డిజిటల్ గ్రామం మిషన్ వంటి పథకాల ద్వారా సాంకేతికతను పల్లె జీవనంలో స్థిరపరచడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమతుల్య జీవన దృక్పథం లేకపోతే ఈ మార్పు నిలదొక్కుకోదు.

టెక్నాలజీ మార్గం కానీ గమ్యం కాదు. టెక్నాలజీ గ్రామాల్లోకి రావడం అనివార్యమైన, శక్తివంతమైన పరిణామం. అదే టెక్నాలజీ, సరైన అవగాహనతో ఉపయోగిస్తే అభివృద్ధి ఆయుధం, లేకపోతే యువత భవిష్యత్తుకు ప్రమాదం. సమాజం, తల్లిదండ్రులు, పాఠశాలలు, ప్రభుత్వ వ్యవస్థలు కలిసి యువతకు టెక్నాలజీని విలువలతో కూడిన సాధనంగా చూపించే బాధ్యత వహించాలి. ఎందుకంటే టెక్నాలజీ మన చేతుల్లో ఉండాలి, మనం దాని బానిసలు కాకూడదన్న విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని పలువురు పేర్కొంటున్నారు.

# పరీక్ష పత్రాల కేంద్రాన్ని తనిఖీ చేసిన డీసీఈబీ కార్యదర్శి

**తాండూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

మండలంలోని బోయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని సంగ్రహణాత్మక ముదింపు (సమ్మేటివ్ అసెస్మెంట్1) పరీక్ష పత్రాల పంపిణి కేంద్రాన్ని మంగళవారం మంచిర్యాల జిల్లా సాధారణ పరీక్షా మండలి (డీసీఈబీ) కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. అనంతరం పరీక్ష పత్రాల కేంద్రం ఇన్చార్జి, బోయపల్లి యుపిఎస్ హెచ్ఎం మధుసూదన్‌ను కార్యదర్శి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్న పరీక్ష పత్రాల పంపిణీ ప్రక్రియను కార్యదర్శి పరిశీలించారు. బోయపల్లి పాఠశాల, కిష్టంపేటలోని విద్యా భారతి పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షా కేంద్రాలను కార్యదర్శి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీఈబీ కార్యదర్శి మాట్లాడుతూ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మల్లేశం, విద్య భారతి విద్యాసంస్థల డైరెక్టర్, కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్ పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి

# ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

**తాండూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ఎదురుగా సర్వీస్ రోడ్డు పక్కన సోమవారం అర్ధరాత్రి సుబాబుల్ కర్ర లోడుతో వెళ్తున్న వాహనాన్ని డ్రైవర్ నిలిపి ఉంచారు. మట్టి లోడుతో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ముందు ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొంది. ముందు ఆగి ఉన్న వాహనం వెనుక భాగంలో టిప్పర్ క్యాబిన్ ధ్వంసమై ఇరుక్కుపోయాయి. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రమాద విషయం తెలుసుకున్న తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని ధ్వంసమైన వాహనాలను వేరు వేరు చేసి ట్రాఫిక్ ను పునరుద్ధరించారు. సర్వీసు రోడ్డుపై వాహనాలను నిలపకుండా పోలీసులు పెట్రోల్ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న టిప్పర్

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా మహేష్ వర్మ



**నస్పూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా నలిమెల మహేష్ వర్మ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నలిమెల మహేష్ వర్మ మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలు నిజాయితీగా నిర్వహిస్తానని, గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని మూడు స్థానాల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ గెలుపుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

### - ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి, పత్తి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ కుమురం మాంతయ్య, కాగజ్‌నగర్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సుద్దాల దేవయ్య, కుడ్మెత విశ్వనాథ్‌లతో జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, ప్రాథమిక సహకార, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలుకు 40 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయా కొనుగోలు కేంద్రాలలో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని, తేమ యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను ఎత్తు ప్రదేశంలో ఉండేలా చూసుకోవాలని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆరిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. పత్తి కొనుగోలులో ఈసారి కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లు జరుగుతున్నందున ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని, రైతుల వివరాలను యాప్ లో నమోదు చేయాలని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ ఈ సంవత్సరం యూరియా కొరత ఉన్నప్పటికీ వ్యవసాయ అధికారులు సమన్వయంతో వ్యవహరించి రైతులకు యూరియా సకాలంలో అందించడం అభినందనీయమని తెలిపారు. ఇదే స్ఫూర్తితో వరి ధాన్యం, పత్తి కొనుగోలులో క్రియాశీలకంగా వ్యవహరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పనిచేయాలని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాలలో 1, దహేగాంలో 1 వరి కొనుగోలు కేంద్రాలు అదనంగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులు


సమావేశంలలో మాట్లాడుతున్న బెల్లంపల్లి జీఎం

## భౌతిక దాడులకు బదులు సాంకేతిక దాడులు

**బెల్లంపల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

గతంలో ఆర్థిక నేరాలు భౌతిక దాడులతో జరిగేవని నేడు సాంకేతికత (టెక్నాలజీ)తో జరుగుతున్నాయని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం జనరల్ మేనేజర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో సైబర్ సెక్యూరిటీ పై అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు వారి వ్యక్తి గత సమాచారం, బ్యాంకు పాస్వర్డ్‌లు, కుటుంబ సభ్యుల ఫోటోలను అంతర్జాలం (ఇంటర్నెట్) లో పొందుపర్చవద్దని సూచించారు. ఎం. శ్రీనివాస్ రావు (డీజీఎం, ఐటి) నానా ఫర్నవీస్ (మేనేజర్ ఐటి, డివై సిఐఎస్ఓ) కార్పొరేట్‌లు ఉదయం ఉద్యోగులు, మధ్యాహ్నం అధికారులకు సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్, అప్రమత్తత పై అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులకు క్విజ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారుల సంఘం అద్యక్షుడు మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, ఎస్ఓటు జీఎం రాజమల్లు, గోలేటి ఓసి ప్రాజెక్ట్ అధికారి ఎన్ ఉమాకాంత్, డివై సీఎంఓ పాండు రంగాచారి, ఏరియా ఐటీ మేనేజర్ ముజీబ్ అన్ని విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి కే.కే డిస్పెన్సరీని సందర్శించిన జనరల్ మేనేజర్ రాధాకృష్ణ

**మందమర్రి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణ కేంద్రంలో గల కే.కే డిస్పెన్సరీని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. సింగరేణి ఉద్యోగులకు ఎల్లవేళలా మంచి వైద్య సౌకర్యాలను కల్పించాలని, పరిశుభ్రత పాటించాలని, సమయపాలన పాటించాలని వారు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, ఐఈడి (ఎస్.సి) కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



## ప్రభుత్వం అనుమతులతో వెంచర్‌లు ఏర్పాటు చేయాలి

### - ఎంపిఓ బాపు రావు

**జైపూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

ఇండ్ల నిర్మాణం కొరకు వెంచర్‌లు ఏర్పాటు చేసే వారు అన్ని ప్రభుత్వ అనుమతులు పొందాలని మండల పంచాయతీ అధికారి బాపు రావు అన్నారు. మంగళవారం ఆయన బెజ్జాల గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి స్వప్నతో కలిసి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వెంచర్‌లో హద్దు రాళ్ళను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర అవసరాల కొరకు వ్యవసాయ భూమిలను కమర్షియల్ మార్చడానికి సంబంధిత శాఖల నుండి అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనుమతి పత్రాలను ఆయా గ్రామ పంచాయితీ సెక్రటరీకి సమర్పించాలని అన్నారు. లేని పక్షంలో భూ యజామానులకు నోటీసులు అందజేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## నవంబర్ 1 వరకు నూతన మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ

### - జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్

**ఆసిఫాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

నూతన మద్యం పాలసీ 2025-27లో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని మిగిలిన 7 మద్యం షాపుల కోసం దరఖాస్తులను ఈనెల 28 నుంచి స్వీకరిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తు ఎఫ్-27 బిలో నూతన మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను నవంబర్ 1 సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మద్యం షాపుల లక్కీ డ్రాను నవంబర్ 3న మధ్యాహ్నం 1 గంటకు జిల్లా కలెక్టర్ సమక్షంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కొరకు 8712658763 ను సంప్రదించాలని పేర్కొన్నారు.


అకాల వర్షానికి తడిసిన పత్తి

## అకాల వర్షం... అపార నష్టం

**పెంచికల్‌పేట్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

గత రెండు రోజులుగా మండల వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వరి, పత్తి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. పత్తి పూలు వర్షానికి తడిసి నల్లగా మారిపోయి నాణ్యత దెబ్బతినే పరిస్థితి నెలకొనగా, వరి పొలాలు నీట మునిగి కోతకు సిద్ధమైన పంటలు నాశనమయిపోయాయి. కష్టపడి సాగుచేసిన పంటలు చేతికొచ్చే దశలో నాశనం కావడంతో ధరలో డిమాండ్ తగ్గి ఆర్థిక నష్టం ఏర్పడుతుందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

**తాండూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఈనెల 29న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవనంలో జరిగే రక్తదాన శిబిరంలో నాయకులు, యువత, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి విజయవంతం చేయాలని ఎస్సై కోరారు.


సంతాపం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

## తన్నీరు సత్యనారాయణకు కోనేరు కోనప్ప నివాళి

**కాగజ్‌నగర్, అక్టోబర్ 28 ప్రభాతవార్త :**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ వయోభారం కారణంగా మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. సత్యనారాయణ మరణవార్తతో హరీశ్‌రావు కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. హైదరాబాద్‌లోని క్రిన్స్ విల్లాస్ వద్ద పార్థివ దేహాన్ని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సందర్శించి నివాళులర్పించి హరీశ్‌రావును పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్యనారాయణ సేవలను కోనప్ప స్మరించుకున్నారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మృతునికి చివరి యాత్రలో పాల్గొనేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## ఆపిల్ తోటను పరిశీలించిన ఏఎస్పీ

**కెరమెరి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

మంగళవారం కెరమెరి మండలం ధానోరా గ్రామానికిచెందిన ఉత్తమ రైతు కేంద్రే బాలాజీ రైతు ఆపిల్ తోటను కుంరంభీమ్ జిల్లా ఏఎస్పీ చిత్తరంజన్ పరిశీలించారు. ఆపిల్ సాగుచేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఏఎస్పీ మాట్లాడుతూ మండల రైతులందరు సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలని కోరారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి ఎ. భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి పోలీస్, రెవెన్యూ, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ పై పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నవంబర్ 1 నుండి 7వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారుల సంస్థ అధికారులు హైదరాబాదు-కరీంనగర్-చంద్రాపూర్ రహదారిపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, బాసర-లక్షెట్టిపేట్ రహదారిపై (రాష్ట్రీయ రహదారి-24) ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నందున భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని, టోల్‌గేట్ వద్ద నిలిపి వున్న వాహనాలను తక్షణమే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు అధికారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు సెల్లార్ స్థలాలు కేవలం పార్కింగ్ కోసం మాత్రమే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని, నాలాలపై అనధికార నిర్మాణాలను వెంటనే తొలగించాలని, సంబంధిత భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. జాతీయ రహదారి 363 పక్కన ఉన్న అక్రమ హోటళ్ళు, వ్యాపార కార్యకలాపాలను వెంటనే తొలగించాలని, విద్యుత్ శాఖ అధికారులు రహదారుల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని, మిషన్ భగీరథ పైప్‌లైన్లు రహదారి అంచుల్లో పాతే ముందు ఆర్ అండ్ బి శాఖ అనుమతి తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచనలు ఏర్పాటు చేయాలని సూచించారు. కూరగాయల వ్యాపారులు రోడ్లపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శ్రీరాంపూర్ బస్ స్టాండ్ వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు బస్ స్టాండ్ వెనుక భాగానికి మార్చాలని, బస్ స్టాండ్‌కు సంబంధించిన అటవీ అనుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. మందమర్రి వంతెన వద్ద కూరగాయల వ్యాపారులు ఆక్రమించిన ప్రదేశాలను క్లియర్ చేయాలని, హైవేకు వెళ్లే రహదారులపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులు, డ్రైవర్లు, ప్రజలను రోడ్డు భద్రత నియమాలపై చైతన్య పరచాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో లైసెన్సులు రద్దు అయిన వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసే తనిఖీల్లో పట్టుబడిన వాహనాల వివరాలను ప్రతి వారం ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



## ప్రజలకు భరోసా కోసమే కమ్యూనిటీ కాంట్రాక్ట్

**దిలావర్‌పూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

పోలీసు శాఖ ప్రజలతో మమేకమై వారికి మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు శాఖపై భరోసా కల్పించేందుకే కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేస్తోందని సీఐ ఎం. కృష్ణ తెలిపారు. మంగళవారం దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు తెల్లవారుజామున కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ, ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం గణనీయంగా పెరగడం వల్ల దానిని కొందరు దుర్వినియోగం చేసి ప్రజలను మోసాలకు గురి చేస్తున్నారని తెలిపారు. వారి ఉచ్చులో పడి ఎందరో డబ్బు గుల్ల చేసుకుని ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. మరి కొందరు యువకులు జల్సాలకు అలవాటుపడి నేర వృత్తిలోకి దిగుతున్నారని, పని పాట లేకుండా ఖాళీగా ఉండే యువకులను గుర్తించి వారితో నేరాలు చేయిస్తున్నారన్నారు. రోడ్ సేఫ్టీ, గంజాయి మీద అవగాహన కనిపించారు. అందులో భాగంగా సరైన పత్రాలు లేని 92 ద్విచక్ర వాహనాలు రెండు ఆటోలు సీజ్ చేసినట్లు తెలిపారు. ఇందులో ఎస్సై రవీందర్, రూరల్ ఎస్సై లింబాద్రి, సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## అంగవైకల్య నిర్ధారణ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలి

**- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

అంగవైకల్యం నిర్ధారణ కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న అంగవైకల్యా నిర్ధారణ కేంద్రాన్ని సందర్శించి గదులు, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగవైకల్యం కలిగి పింఛనుదారుల పునరుద్ధరణ కొరకు, నూతన పింఛన్ కొరకు దరఖాస్తు చేసుకునే వారికి అంగవైకల్యా నిర్ధారణ చేసి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నిర్ధారణ కేంద్రంలో అంగవైకల్యం కలిగిన వారికి, సహాయకులుగా వచ్చే వారి కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పరీక్ష పరికరాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. నిర్ధారణ కేంద్రానికి వచ్చే దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తరాం, ఆసుపత్రి పర్యవేక్షకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి, ఉత్తమ భవిష్యత్‌కు శ్రమించాలి

**- శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్**

**జైపూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి, ఉత్తమ భవిష్యత్ కొరకు శ్రమించాలని శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్ అన్నారు. మంగళవారం ఎస్ఐ శ్రీధర్‌తో కలిసి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల సేవనం వల్ల జరిగే అనర్థాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికాన్ని జయించడం ఒక్క విద్యతోనే సాధ్యమవుతుందని అన్నారు. తల్లిదండ్రుల కలలు నెరవేర్చేందుకు కష్టపడి చదువుకోవాలని సూచించారు. ప్రణాళిక బద్ధంగా చదువు కొనసాగిస్తే ఉన్నత స్థానంలో స్థిర పడవచ్చని అన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్

## ఆకాంక్షిత బ్లాక్‌లో చేపట్టిన పనులపై పురోగతి సాధించాలి

**- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

జిల్లాలోని తిర్యాణి మండలంలో ఆకాంక్షిత బ్లాక్‌లో భాగంగా చేపట్టిన పనులపై పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి తిర్యాణి మండలంలో చేపట్టిన కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కార్యదర్శి పనుల పురోగతిపై పర్యవేక్షి స్తున్న నేపథ్యంలో ఆకాంక్షిత బ్లాక్‌లో భాగంగా తిర్యాణి మండలంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతులు, కంప్యూటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రోగులతో పాటు వచ్చే వారి కోసం వెయిటింగ్ గదుల నిర్మాణం, ఆరోగ్య కార్యకర్తలకు ట్యాబుల పంపిణీ, ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో మౌలిక వసతులు, నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యత శిక్షణ అందించడం, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మండలంలో చేపట్టవలసిన పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, ముఖ్య ప్రణాళిక అధికారి వాసుదేవరెడ్డి, విద్యాశాఖ ప్రణాళిక సమన్వయకర్త అబిద్ అలీ, తిర్యాణి మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్లేష్, పంచాయతీరాజ్, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వర్ష బీభత్సం

**చింతలమానేపల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

మండలంలో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు రైతుల జీవితాలను దెబ్బతీశాయి. కర్జవెల్లి, గంగాపూర్, అనుకోడ, గూడెం, బాబాసాగర్, రుద్రపూర్, రవీంద్రనగర్, రన్వెల్లి, కోర్సిని, కేతిని, డబ్బా తదితర గ్రామాల్లో వరి పంటలు పూర్తిగా నీట మునిగిపోయాయి. చేతికందిన పత్తి కాయలు, పేలిన పత్తి పూర్తిగా తడిసి ముద్దాయి నల్ల కలరు రావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలు చెరువుల్లా మారిపోయాయి. నీరు తగ్గకపోవడంతో పంట పూర్తిగా పాడైపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ఆర్థికంగా కష్టాల్లో ఉన్న రైతులు ప్రభుత్వం తమను ఆదుకోవాలని, తక్షణమే నష్టపరిహారం ప్రకటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మండల అధికారులు గ్రామాలను సందర్శించి నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు.

# సదరం శిబిరాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

## అనారోగ్యంతో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ భార్గవ్ మృతి


దుగుట భార్గవ్ (ఫైల్)

బెల్లంపల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దుగుట భార్గవ్ అనే ఉద్యోగి అనారోగ్యంతో మృతి చెందారు. కాసిపేట మండలంలోని ముత్యంపల్లి గ్రామానికి చెందిన దుగుట భార్గవ్ (25) గత 8 ఏళ్లుగా బెల్లంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) విభాగంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బెల్లంపల్లి మండల ఈ జీ ఎస్ ఎంపీడీవో కార్యాలయానికి గ్రామాల నుంచి ఎవరు ఏ పని మీద వచ్చిన చిరు నవ్వుతో పలకరించే దుగుట భార్గవ్ వేధింపుల వల్ల అనారోగ్యానికి గురై మృతి చెందడం పట్ల ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్సై సర్తాజ్ పాషా

## పోలీసు సేవలపై విద్యార్థులకు అవగాహన

బెజ్జూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త

బెజ్జూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు పోలీసుల ఆయుధాలు, వాటిని ఉపయోగించే పద్ధతులను విద్యార్థులకు వివరించారు. అంతేకాకుండా నేరాల నియంత్రణకు పోలీసులు అనుసరిస్తున్న పద్ధతులను తెలియజేశారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా ఉండాలని సూచించారు. ఉన్నత చదువులు చదువుకొని అనుకున్న లక్ష్యాలను సాధించాలని తెలిపారు.



## బార్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక

లక్సెట్టిపేట, అక్టోబర్ 28, ప్రభాతవార్త

లక్సెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా గాండ్ల సత్యనారాయణ మంగళవారం రోజున పదవి బాధ్యతలు స్వీకరించారు. జూనియర్ సివిల్ జడ్జ్ కాసమల్ల సాయికిరణ్, ఏపీపీ అజయ్ కుమార్ ఎలక్షన్ సభ్యులుగా ఉన్నారు. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో గాండ్ల సత్యనారాయణ విజయం సాధించి అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి సత్తన్న, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్, సీనియర్ న్యాయవాదులు భూమరెడ్డి, సురేందర్‌రావు, సురేందర్, మిగతా న్యాయవాదులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## పాము కాటుతో మహిళ మృతి

కెరమెరి, అక్టోబర్ 28, ప్రభాతవార్త


సంధ్య (ఫైల్)

కెరమెరి మండలం సావర్ ఖేడ గ్రామానికి చెందిన మొహర్లే సంధ్య (32) పాముకాటుతో మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు ... ఆమె సోమవారం ఇంటి పక్కనున్న పత్తి చేనులో పత్తి ఏరడానికి వెళ్లగా, గుర్తు తెలియని పాము ఎడమ కాలుపై కాటు వేసింది. అటు వైపుగా వెళ్తున్న స్థానికులు గమనించి భర్త తులసి రామ్ కు ఫోన్ చేయగా, వెంటనే ఆయన వచ్చారు. వెంటనే ఆమెను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

### - ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త

నూతన ధ్రువపత్రాల కొరకు జిల్లాలో చేపట్టిన సదరం శిబిరాలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న సదరం శిబిరాన్ని సందర్శించి అభ్యర్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు ధ్రువపత్రాలు అందించేందుకు సదరం శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని, అర్హత కలిగిన దివ్యాంగులకు ధ్రువపత్రాలు జారీ చేయడంలో పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. అంగవైకల్య నిర్ధారణ పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలని, శిబిరానికి వచ్చే దివ్యాంగులు, సహాయకుల కొరకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అర్హతలు కలిగిన వారందరికీ సదరం ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రాన్ని అందిస్తున్న వివిధ సంఘాల నాయకులు

## శ్రావణి కుటుంబాన్ని ఆదుకోవాలి

బెజ్జూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త

దహెగాం మండలంలోని గెర్రె గ్రామంలో హత్యకు గురైన శ్రావణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారి కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆదివాసి కోయ సంక్షేమ సంఘం, అంబేద్కర్ యువజన సంఘం, కొలవార్ సంఘం, మహిళ సంఘాలు మంగళవారం బెజ్జూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించాయి. శ్రావణి కుటుంబానికి వెంటనే 25 లక్షల పరిహారం ప్రకటించాలని, కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని, మూడెకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని వారు కోరారు. భవిష్యత్తులో కుల హత్యలు జరగకుండా ప్రభుత్వం కులాంతర రక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితునికి తక్షణమే శిక్ష పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతి పత్రాన్ని అందించిన వారిలో ఆదివాసి కోయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సోయం చిన్నయ్య, ఉపాధ్యక్షుడు మధుకర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట సతీష్, కొలవార్ సంఘం సహ కార్యదర్శి వెంకటేష్, శంకర్, మహేష్, తిరుపతి, కోయ సంఘం మండల అధ్యక్షుడు కోరెతె తిరుపతి, మహిళా సంఘం అధ్యక్షురాలు అమృత ఉన్నారు.

## అదుపుతప్పి ఆటో బోల్తా

### ఆటో డ్రైవర్‌తో సహా ముగ్గురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమము

వేమనపల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త:

అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో నలుగురు గాయపడ్డారు. మంగళవారం జరిగిన ఈ సంఘటన సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బద్దంపల్లి గ్రామానికి చెందిన నాయిని గట్టయ్యకు చెందిన టిజి 19టి 1161 నంబర్ గల ఆటో ముగ్గురు ప్యాసింజర్లతో ఈటెపల్లికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో గొర్లపల్లి, నీల్వాయి మధ్యలో ఉన్న బ్రిడ్జి మూలమలుపు వద్ద అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవర్, ముగ్గురు ప్యాసింజర్లకి గాయాలు కాగా గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నలుగురిలో ఒక్కరి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన ప్రమాద పరిస్థితులను పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


బోల్తాపడ్డ ఆటో

## ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో విజిలెన్స్ వారోత్సవాల సంబంధిత గోడ ప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ నుండి నవంబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని, బాధ్యతగా పనిచేసే ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. నిబద్ధతతో పనిచేస్తూ అవినీతి, అక్రమాల నిర్మూలనలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రాన్ని అందిస్తున్న వివిధ సంఘాల నాయకులు

## రక్తదానం అత్యున్నత సేవలో ఒకటి: ఏఎస్పీ

కెరమెరి, అక్టోబర్ 28, ప్రభాతవార్త


రక్తదానం చేస్తున్న రక్త దాతలు

రక్తదానం చేయడం మనిషి చేయగల అత్యున్నత సేవలో ఒకటని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కెరమెరి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్టార్ ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని అన్నారు. అమరవీరుల స్ఫూర్తిని ఎప్పటికీ నిలిచిపోయేలా చేస్తాయని తెలిపారు. కెరమెరి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి 71 మంది యువత రక్తదానానికి ముందుకు తరలివచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువతకు ఏఎస్పీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ, ఎస్సై, మధుకర్, ప్రజలు పోలీసు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



రుణమంజూరు చెక్కును జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త**

నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులు, లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీ (వార్డు నం.1) లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, గృహ నిర్మాణ శాఖ పి.డి. వేణుగోపాల్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తోందని తెలిపారు. లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి, కేటాయించిన నిబంధనల ప్రకారం వినియోగించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందజేస్తోందని, అలాగే నిర్మాణం పూర్తయిన దశల వారీగా బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని ఆయన వివరించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో సందర్శనలు నిర్వహించి లబ్ధిదారులకు అవసరమైన సూచనలు అందించి, పనులు వేగవంతం అయ్యేలా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. తదనంతరం ఆర్థికంగా వెనుకబడిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మండల సమాఖ్య ద్వారా రుణమంజూరు చెక్కులను కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మధుకర్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీపీఓ వెంకటేశ్వరరావు

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### - రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవు

### - మంచిర్యాల డీపీఓ వెంకటేశ్వర్ రావు

**తాండూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

యజమానులు తమ షాపుల ముందు పరిసరాలను పరిశుభ్రముగా ఉంచుకోవాలని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం తాండూర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఐ.బి. రహదారులు, సుభద్ర కాలనీలోని ఉర్దూ, తెలుగు మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలు, అంగన్వాడి కేంద్రాన్ని, స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న షాపులను పరిశీలించి చెత్త వేసిన షాపు యజమానులకు డీపీఓ జరిమానా విధించి, షాపుల ముందు, రోడ్లపైన చెత్తాచెదారం వేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా మల్టీపర్పస్ వర్కర్ల చేత ఎప్పటికప్పుడు పరిసరాలు, మురికి కాలువలు శుభ్రం చేయించాలని, పారిశుద్ధ్య పనుల్లో నిరక్ష్యం చేయొద్దని కార్యదర్శికి సూచించారు. డీపీఓ వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి దివాకర్ తదితరులు ఉన్నారు.

## మెడిటేషన్ వల్ల ఏకాగ్రత సాధ్యం

**లక్షెట్టిపేట, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మెడిటేషన్ తరగతులు నిర్వహించడం వల్ల చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్షుఘుఘ్మణ్ రావు అన్నారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులలో చదువుపై ఆసక్తి పెంచేందుకు ప్రతినెల మూడుసార్లు మెడిటేషన్ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరీక్షలలో మంచి మార్కులు సాధించేలా కృషి చేస్తున్నామన్నారు.

## శ్రావణి కుటుంబానికి తగు న్యాయం చేయాలి

### - సిపిఎం పార్టీ, ప్రజాసంఘాల నాయకులు

### - ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవికి వినతిపత్రం అందజేత

**దహెగాం, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

దహెగాం మండలం గెర్రే గ్రామంలో కుల దురహంకార హత్య జరిగిన శ్రావణి కుటుంబానికి తగు న్యాయం చేయాలని అన్నారు. గెర్రే గ్రామంలో శ్రావణి నిండు గర్భిణీని అతి కిరతకంగా హత్య చేసిన సత్తయ్యని అతనికి సహకరించిన కుటుంబానికి జీవిత ఖైదు శిక్ష విధించాలని, శ్రావణి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండి తగు న్యాయం చేయాలన్నారు. మంగళవారం నాడు గెర్రే గ్రామానికి వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవికి సిపిఎం పార్టీ, ప్రజాసంఘాలు టీఏజీఎస్, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ఏఐఏడబ్ల్యూయుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రావణి నిండు గర్భిణీ కావడంతో రెండు హత్యాల కేసు పెట్టాలని, ఎఫ్ఐఆర్‌లో సత్తయ్య పేరు ఒకరిదే ఫైల్ అందని అతని కుటుంబ పేర్లను చేర్చాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి కేసు విచారణ వేగవంతం చేయాలని, హత్యలో శ్రావణి భర్త అయిన శేఖర్‌ను అరెస్ట్ చేయాలని, గెర్రే గ్రామంలో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయాలని, శ్రావణి కుటుంబానికి రూ॥ 25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని, శ్రావణి కుటుంబానికి 5 ఎకరాల ప్రభుత్వ భూమి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కుల దురహంకార ఆగడాలు జరగకుండ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించాలని డిమాండ్ చేసారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు సానుకూలంగా స్పందించి మీ డిమాండ్స్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కార దిశగా చొరవ తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కాగజ్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జి ముంజం ఆనంద్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్, డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బక్కన్న, మండల అధ్యక్షులు సిడం శంకర్, మాజీ సర్పంచ్ బానక్క మండల కమిటీ సభ్యులు అంజన్న, శంకర్, హనుమంతు, శంకర్, పోశం శంకర్, శ్రావణి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

## పద్మశాలి భవన్‌లో నేడే మెగా రక్తదానశిబిరం

**బెల్లంపల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవనంలో మెగా రక్తదాన శిబిరాన్ని సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నమని వన్ టౌన్ సిఐ శ్రీనివాస్ రావు తెలియజేశారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా వారి ఆత్మ బలిదానాలను స్మరించుకుంటూ బుధవారం రోజున ఉదయం 9 గంటలకు బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్‌లో బెల్లంపల్లి సబడివిజన్ పోలీసు వారిచే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయుచున్నామన్నారు. కావున ఇట్టి రక్తదాన శిబిరంలో బెల్లంపల్లి పట్టణ ప్రజలు, యువత, ఉద్యోగులు, అధిక సంఖ్యలో పాల్గొని ఇట్టి మెగా రక్తదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.



గాయపడిన వృద్ధురాలు, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడండి

### - జిల్లా అధికారులు వెంటనే స్పందించాలి

**బెల్లంపల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ఎంసిపిఐయు పార్టీ ఆధ్వర్యంలో కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఎంసీపీఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ బెల్లంపల్లిలో కుక్కలు సైర విహారం చేస్తున్న కూడా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం అనేది చాలా సిగ్గుచేటని మంగళవారం రోజున 31వ వార్డులో ఒక పెద్ద మనిషి వృద్ధురాలుకు కుక్క కరవటంతో రక్తస్రావం అధికంగా అయిందని అదే సమయంలో చిన్నపిల్లలు గనుక ఉంటే ఆ చిన్నపిల్లలను కుక్కలు చంపేసేటివని వెంటనే కుక్కలను ఊరు అవుతల వదిలి పెట్టాలని కుక్కల బెడద నుండి బెల్లంపల్లి ప్రజలను కాపాడాలని లేకపోతే బెల్లంపల్లిలోని అన్ని పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు పార్టీ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, తోగరి రాహుల్, పోలోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా నిషేధానికి తీర్మానం

### - వేమనపల్లి మండలం గుడుంబా నిర్మూలన దిశగా అడుగులు

**వేమనపల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలంలోని గుడుంబా నిర్మూలన దిశగా పలు గ్రామాల్లో చైతన్యం మొదలైంది. మొన్నటికి మొన్న సుంపుటం గ్రామంలో తీర్మానం చేయగా మంగళవారం నాడు నాగారంలో ప్రజలంతా రాజకీయ పార్టీలకు అతీతంగా ఏకమై మా గ్రామంలో ఈ రోజు నుండి గుడుంబా పూర్తిగా నిషేధిస్తున్నామని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో గుడుంబా తయారు చేయడం అమ్మడం తాగడం వంటి వాటిపై పూర్తిగా నిషేధిస్తున్నామని ఇకపై గ్రామం నుండి ఎవరైనా గుడుంబా రవాణా చేసిన పట్టుకొని పోలీస్ సిబ్బందికి అప్పగిస్తామని పేర్కొన్నారు. గుడుంబా అమ్మకాలు ఎక్కువ కావడంతో కుటుంబాలు చిన్నభిన్నం అవుతున్నాయని చెప్పారు. గుడుంబాతో కలిగే అనర్థాలకు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న నాగారం ప్రజలు

# కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన కార్మిక నాయకులు



డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారితో మాట్లాడుతున్న నాయకులు



ఆదిలాబాద్ కమీషనర్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఇ-2381 కార్మిక నాయకులు

**కాగజ్‌నగర్, అక్టోబర్ 28 ప్రభాతవార్త :**

అదిలాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ యజమాన్యము, కార్మిక సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన జాయింట్ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో తెలంగాణ సిర్పూర్ పేపర్ మిల్స్ ఎంప్లాయిస్ ప్రొడక్షన్ యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్ ఇ-2381 యూనియన్ నాయకులు మాట్లాడుతూ సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు వచ్చే నెల నవంబర్ చివరి వారంలోగా ఎన్నికలు నిర్వహిస్తామని డిసిఎల్ రాజేశ్వరి హామీ ఇచ్చారని, ఈ సమావేశానికి మేనేజ్మెంట్ కుంటి సాకులతో హాజరు కావాలనే కాలేదు అయినా రిజిస్ట్రేషన్ నెంబర్ ఇ-2381 రిజిస్ట్రేషన్ నెంబర్ తరపున డిసిఎల్‌కి మేనేజ్మెంట్ రాకపోయినా మెజార్టీ రిజిస్ట్రేషన్ సంఘాలు హాజరైనప్పుడు తప్పకుండా ఎన్నికల ప్రకటన మీరు చేయడానికి వీలుంటుంది, అని ప్రశ్నించినట్లు వారు తెలిపారు. అదేవిధంగా యజమాన్యం ఎప్పుడూ కూడా ఎన్నికలు నిర్వహించడానికి కార్మికులకు హక్కులు చెల్లించడానికి ముందుకు రాదు కాబట్టి యజమాన్యంతో మాట్లాడి పూర్తి కార్మికుల లిస్టును వివరాలు తీసుకొని ఎన్నికల తేదీని ప్రకటించాలని అడిగినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన డిసిఎల్ రాజేశ్వరి మేనేజ్మెంట్ తో మాట్లాడి నవంబర్ మూడు తారీకు లోపల పూర్తి లిస్టు తీసుకుని ఫైనలైజ్ చేసి, వచ్చే నెల నవంబర్ చివరి వారంలో సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు మా యూనియన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశామన్నారు. అదేవిధంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో కార్మికులకు ఏ విధమైన కష్టాలు జరిగిన ఏ సమస్య వచ్చినా ఎస్పీఎం గేటు ముందు నిలబడి సహకరించడానికి తెలంగాణ సిర్పూర్ పేపర్ మిల్స్ ఎంప్లాయిస్ ప్రొడక్ట్స్ యూనియన్ ఇ-2381 నాయకులు కార్యవర్గ సభ్యులు అందుబాటులో ఉంటామని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో మంచి రోజులు వస్తాయని తెలియజేశారు. అదిలాబాద్ డిసిఎల్ సమావేశ సమావేశంలో యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు లెండుగురే శ్యామ్ రావు,యూనియన్ చీఫ్ ఉపాధ్యక్షులు గోలెం వెంకటేశం,యూనియన్ ప్రధాన కార్యదర్శి వల్ల సుభాష్ యూనియన్ ఉపాధ్యక్షులు శీలం రాజా మొగిలి,యూనియన్ కోశాధికారి నల్ల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి కొత్తకొండ రాజేష్‌లు పాల్గొన్నారు.



## అంతరించిపోతున్న కళకు ఆదరణ

**సారంగాపూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

*తెలంగాణలో జానపద కళలలో ఒకటైన సింధుయాక్షగానం. మండలంలోని కౌట్ల(బి )గ్రామంలో సింధు యాక్షగానకళాకారులు. ఆట ఆడుతామని గ్రామస్తులను అడగగా గ్రామ పెద్దలు ఆడు కోవడానికి అనుమతినిచ్చి, కళాకారులకు ప్రోత్సాహకంగా కొంత విరాళం ఈవ్వడం జరిగింది. ఈ కళకు గతంలో ఎంతో ఆధారఉండేది. నేడు అంతరించి పోతున్నాయి. కొద్ది మంది కళాకారులు తమ వృత్తిగా భావించి ఈ కళను కాపాడు తున్నారు.నేడు ఆధునిక విద్యా విధానంతో వెళ్తున్న యువత కు గతంలో గ్రామీణ జీవన విధానంలో నాటకాల ద్వారా ప్రజలందరూ ఒక దగ్గరకు చేరి నాటకాన్ని వీక్షించేవారు. దీని ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొందేవారు. ప్రస్తుతం టీవీ, కంప్యూటర్, సెల్‌ఫోన్ రంగంలో యువత బిజీ జీవితాన్ని గడుపుతున్నారు. గ్రామలలో పూర్వం కళలను ఏవిధంగా అందరించేవారు. నేటి యువత తెలుసుకోవాలని ప్రతి కళాకారున్ని ప్రోత్సాహించాలి. నాటి ప్రజలు మానసిక ఉల్లాసం ఏ విధంగా పొందేవారు.నేటి యువత గ్రహించాలి. కలసిమెలసి ఉండే ఏంత ఆనందమో తెలుసుకోవాలి అని గ్రామ పెద్దలు, వృద్ధులు తెలిపారు.*

# కాగజ్‌నగర్‌లో భక్తి శ్రద్ధలతో ఛట్ పూజలు

**- ఛట్ పూజల్లో పాల్గొన్న మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ రావు**



పూజల్లో పాల్గొన్న మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ రావు

**కాగజ్‌నగర్, అక్టోబర్ 28 ప్రభాతవార్త**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ఎస్పీఎం మైదానంలో ఉత్తర భారతీయులు ప్రతి ఏటా కార్తీక మాసంలో నిర్వహించే ఛట్ పూజా కార్యక్రమం భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ రావు గారు పాల్గొని సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర భారతీయులు ప్రతి ఏటా కార్తీక మాసంలో సూర్యభగవానునికి నీటిలో నిలబడి ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈసారి కూడా అదే భక్తి తత్పరతతో పట్టణంలోని ఎస్పీఎం మైదానంలో పూజలు నిర్వహించారు.చివరి రోజైన ఈరోజు ఉదయం జరిగిన పూజల్లో పాల్గొన్న కోనేరు కృష్ణ రావు గారు సూర్యభగవానుని ప్రార్థించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ విజయ్ యాదవ్, ఉత్తర భారతీయ సంఘ నాయకులు, స్థానికులు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

## స్టాక్స్ పేరుతో 76 లక్షల మోసం

**- నిందితుడు అరెస్ట్ - వివరాలు వెల్లడించిన డీఎస్పీ వహిదుద్దీన్**

**కాగజ్‌నగర్, అక్టోబర్ 28 ప్రభాతవార్త**

స్టాక్స్,ఐపీఓ ఆన్లైన్ ఇన్వెస్ట్మెంట్ పేరుతో ప్రజలను మోసం చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ వెల్లడించారు.కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు దారుడు ఇచ్చిన సమాచారం ప్రకారం"స్టాక్స్, ఐపీఓ ఆన్లైన్ ఇన్వెస్ట్మెంట్" పేరుతో అశోక్ కుమార్ అనే వ్యక్తి నిందితుడు వాట్సాప్ గ్రూపులు వర్మాస్ బుక్ డిస్కషన్, అలయన్స్ గ్రూప్ లను సృష్టించి అందులో 108 మందిని చేర్చి పెట్టుబడుల పేరుతో ప్రజలను మోసం చేశాడు. బాధితుడు ఒక్కడే 26 ట్రాన్సాక్షన్ల ద్వారా రూ.76.50 లక్షలు పెట్టుబడి పేరుతో చెల్లించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ టౌన్ సీఐ ప్రేమ్ కుమార్, పోలీస్ సిబ్బంది, డీఫోర్సీ బృందం సాంకేతిక సహకారంతో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. విచారణలో నిందితుడు ప్రజల నమ్మకాన్ని దుర్వినియోగం చేసి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు తేలింది. అనంతరం కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని గుర్తించడంలో కాగజ్‌నగర్ సీఐ ప్రేమ్ కుమార్, ఎస్సై సుధాకర్, సైబర్ క్రైమ్ మరియు డీఫోర్సీ బృందం చేసిన కృషిని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అభినందించారు. సోషల్ మీడియాలో పెట్టుబడుల పేరుతో వచ్చే ఆఫర్లను నమ్మవద్దు. అపరిచితులు సృష్టించిన గ్రూపులలో చేరవద్దు. ఆన్లైన్ ఇన్వెస్ట్మెంట్ చేయాలంటే అధికారిక ప్లాట్‌ఫార్మ్స్ మాత్రమే ఉపయోగించాలి.సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయండి లేదా సంభందిత సైబర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



# వడ్ల కొనుగోళ్లలో మద్దతు ధర లభించేలా అధికారులు కృషి చేయాలి

**- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు**

**కాగజ్‌నగర్ రూరల్,అక్టోబర్ 28 ప్రభాతవార్త :**

వడ్ల కొనుగోళ్లలో రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు ధర లభించేలా అధికారులు కృషి చేయాలని సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మంగళవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో వానా కాలం వరి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు పూర్తిస్థాయి గిట్టుబాటు ధర అందేలా కృషి చేయాలని తెలిపారు. యూరియా కొరత ఉన్న సమయంలో వ్యవసాయ అధికారులు సమర్థవంతంగా పని చేశారని, అదే చొరవతో రైతులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్ఓ లోకేష్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ జోయల్ జసింత్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, డిసీఎంఎస్ చైర్మన్ కుమురం మాంతయ్య, కాగజ్‌నగర్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు దేవయ్య, విశ్వనాథ్, మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు